నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 31 | పేజీలు: 5 | వెల: రూ.4/- | మంగళవారం 23 సెప్టెంబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి



## అగ్రసేన్ మహారాజ్‌కు సిఎం నివాళి

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే ఉదయం)

శ్రీ అగ్రసేన్ మహారాజ్ జయంతి సందర్భంగా.. ఆయనకు సిఎం రేవంత్ ఘనంగా నివాళి అర్పించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12 లోని ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ-సీఎం భట్టి విక్రమార్క, హైదరాబాద్ మేయర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ఎంఎల్ఏ దానం నాగేందర్ హాజరయ్యారు.

# హైవే పనుల్లో అలసత్వం వద్దు



### భూసేకరణ, పరిహారం పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదు

### కలెక్టర్లు, ఆర్డీవోలకు సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరిక... అక్టోబర్ కల్లా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం

### ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల పనులు ఒకేసారి ప్రారంభించాలని ఎన్‌హెచ్ఏఐకి విజ్ఞప్తి

### పలు ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్.సెప్టెంబర్ 22 (నమస్తే ఉదయం) :

తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ, పరిహారం పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూ సేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవరించాలని... అదే సమయంలో రహదారుల నిర్మాణంతో కలిగే లాభాలను రైతులకు వివరించి ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ఆర్బిట్రేషన్ కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం.. అనుమతుల జారీ, నూతన ప్రతిపాదనలకు ఆమోదం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), జాతీయ రహదారుల విభాగం (ఎన్‌హెచ్), జాతీయ రహదారులు, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్), రహదారులు, భవనాల శాఖ,



అటవీ శాఖ అధికారులతో సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారులకు నెంబర్ల కేటాయింపు... సూత్రప్రాయ అంగీకారం తెలుపుతున్నా... తర్వాత ప్రక్రియలో ఆలస్యంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు.. చిన్న చిన్న కారణాలతో పలు రహదారుల పనుల్లో జాప్యం వాటిల్లుతుండడం సరికాదని.. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు సీఎం సూచించారు. భూ సేకరణను వేగవంతం చేసి పరిహారం తక్షణమే అందేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ..మిగతా 2లో



## హైదరాబాద్‌లో భారీ వర్షం

### పలు చోట్ల ట్రాఫిక్ జామ్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే ఉదయం)


అల్పపీడనం ప్రభావంతో హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఖైరతాబాద్, ఎల్బీనగర్, పెద్దఅంబర్‌పేట తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులపై నీరు నిలిచింది. ఖైరతాబాద్-రాజ్‌భవన్ రోడ్డులో మోకాలి లోతు నీరు నిలిచి పోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అమీర్‌పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది



## జూరాలకు కొనసాగుతున్న వరద

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22(నమస్తే ఉదయం)

జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది.. సోమవారం సాయంత్రానికి జూరాలకు 2,82,000 క్యూసెక్కులకు ఇన్ ఫ్లో నమోదు కాగ ప్రాజెక్టు 37 గేట్లు తెరిచి 2,56,000 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 317.970 మీటర్ల స్థాయిలో 8.551 టీఎంసీలను నిల్వ చేసుకుని విద్యుదుత్పత్తి కోసం 29,075 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, భీమా లిఫ్ట్ కు 650 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాలువకు 1030 క్యూసెక్కులు, కుడి కాలువకు 580 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



## సమ్మక్క సాగర్ ప్రాజెక్టు

# నిర్మాణానికి ఎన్ఓసీ

### జారీ చేసేందుకు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ఓకే

### ప్రాజెక్టు నిర్మాణానికి ఎన్ఓసీ జారీ చేయాలని విష్ణుదేవ్ సాయ్‌ని కలిసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే ఉదయం)

గోదావరి నదిపై తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) జారీ చేయడానికి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ అంగీకరించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం రాయ్‌పూర్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి, ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎన్ఓసీ జారీ చేయాలని కోరారు. సహాయ, పునరావాస చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. దీంతో ఎన్ఓసీ జారీ చేయడానికి విష్ణుదేవ్ సూత్రప్రాయంగా అంగీకారం తెలపడంతో ఉత్తమ్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో నీటి లభ్యతను పెంచడానికి గోదావరిపై 6.7 టీఎంసీల సామర్థ్యంతో సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాజెక్టు వెనుక జలాల వల్ల ఛత్తీస్‌గఢ్‌లో కొంత భాగం ముంపునకు గురవుతోంది. ముంపు ప్రాంతంలో భూసేకరణ, పరిహారం చెల్లించే విషయంపై ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చించారు. ఇదే అంశంపై ఎన్ఓసీ జారీ చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, విష్ణుదేవ్ సానుకూల స్పందనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం ప్రాజెక్టు సాధనలో సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఒక ముందడుగు అని ఆయన అభివర్ణించారు. ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరావాస బాధ్యతను ..మిగతా 2లో

# దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం

### స్వదేశీ ఉత్పత్తులను వాడండి.. ప్రజలకు మోడీ బహిరంగ లేఖ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (నమస్తే ఉదయం)

నవరాత్రి మొదటి రోజైన సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు బహిరంగ లేఖను రాశారు. ఈ లేఖలో ఆయన దేశ ప్రజలందరికీ స్వదేశీ ఉత్పత్తు లను ప్రోత్సహించాలని సూచించారు. దుకాణదారులు అందరూ 'భారతదేశంలో తయారు చేసిన' ఉత్పత్తులను విక్రయించా లని విజ్ఞప్తి చేశారు. 'మనం గర్వంగా చెప్పుకుందాం - మనం కొనేది స్వదేశీ, మనం అమ్మేది స్వదేశీ' అని ప్రధాని బహిరంగ లేఖలో పేర్కొన్నారు. దేశంలో నూతన ఏ సంస్కరణలు అమలులోకి రావడంతో తగ్గిన రేట్లు- 375 వస్తువులపై వర్తిస్తాయని పేర్కొన్నారు. ఆటోమొబైల్స్ నుంచి రోజువారీ వినియోగ వస్తువుల వరకు ..మిగతా 2లో

## సింగరేణి ఉద్యోగులకు దసరా బోనస్

### ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

### ఒక్కో కార్మికుడికి రూ. 1,95,610 పంపిణీకి నిర్ణయం

### మొత్తంగా రూ. 819 కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రకటన

### 71 వేల మంది శాశ్వత, కాంట్రాక్టు కార్మికులకు లబ్ధి

### సంస్థ లాభాల్లో 34 శాతం వాటాగా బోనస్ చెల్లింపు

### దీపావళికి కార్మికులకు మరో బోనస్ ఉంటుందన్న భట్టి విక్రమార్క



2

# హైవే పనుల్లో అలసత్వం వద్దు

**మొదటి పేజీ తరువాయి...**

నార్త్ నిర్మాణానికి సంబంధించి కేంద్రం లేవనెత్తిన ప్రతి సందేహాన్ని తాము నివృత్తి చేస్తున్నా ఎప్పటికప్పుడు కొత్త సమస్యలను ఎందుకు లేవనెత్తుతున్నారంటూ ఎన్‌హెచ్ఏఐ అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సందేహాలన్నింటిని ఒకే సారి పంపాలని అధికారులకు సూచించారు.. ఆ అంశంపై తాము చర్చించుకున్నామని... ఎటువంటి సందేహాలు లేవని, ఏవైనా ఉంటే వెంటనే పంపుతామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు సీఎంకు తెలియజేశారు. ఆర్ఆర్ఆర్ నార్త్.. సౌత్‌ను రెండు వేర్వేరు ప్రాజెక్టులుగా చూడవద్దని... సౌత్‌కు కూడా నార్త్‌కు ఇచ్చిన నెంబర్‌ను కొనసాగించాలని...వెంటనే అనుమతులు మంజూరు చేసి ఏకకాలంలో రెండింటి పనులు ప్రారంభమయ్యేందుకు సహకరించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సీఎం సూచించారు. అందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు సుముఖత వ్యక్తం చేశారు. ఆర్ఆర్ఆర్ సౌత్ అలైన్‌మెంట్‌కు వెంటనే ఆమోదముద్ర వేయాని సీఎం కోరారు...

భారత్ ఫ్యూచర్ సిటీ-అమరావతి-మచిలీపట్నం 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకు వెంటనే అనుమతులు ఇవ్వాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో తాము డ్రైపోర్ట్... లాజిస్టిక్ పార్క్.. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామని సీఎం తెలిపారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేతో రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య అనుసంధానం ఏర్పడడంతో సరకు రవాణా, ప్రయాణికులకు ఎంతగానో సౌకర్యవంతంగా ఉంటుందని సీఎం అన్నారు. హైదరాబాద్-విజయవాడల మధ్య 70 కిలోమీటర్లు దగ్గరవడంతో పాటు సరకు రవాణాతో భారత దేశంలో మరే జాతీయ రహదారిపై లేనంత రద్దీ.. ఆదాయం ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేతో ఉంటుందని సీఎం తెలిపారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోనూ రెండు రాష్ట్రాల మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మించాలని పేర్కొన్నారని సీఎం గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తక్షణమే రంగంలోకి దిగి పీఎం గతిశక్తి లేదా మరే పథకంలోనైనా ఈ రహదారికి అవసరమైన అనుమతులు ఇవ్వడంతో పాటు అలైన్‌మెంట్ ఖరారు చేయాలని సూచించారు. ఈ రహదారికి సమాంతరంగా తాము రైలు మార్గం అడుగుతున్నామని... బెంగళూర్-శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-అమరావతి మధ్య రైలు మార్గం అవసరమని.. వందేభారత్ సహా ఇతర రైళ్ల రాకపోకలకు ఇది అనువుగా ఉంటుందని.. లాభసాటి మార్గమని సీఎం అన్నారు.

హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో రావిర్యాల-మన్ననూర్‌కు సంబంధించి ఎలివేటెడ్ కారిడార్‌కు వెంటనే అనుమతులు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. శ్రీశైలం దేవస్థానం, శ్రీశైలం రిజర్వాయర్, టైగర్ ఫారెస్ట్ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తారని సీఎం తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్‌కు అవసరమైన అనుమతులు మంజూరు చేసి తక్షణమే పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సీఎం సూచించారు. హైదరాబాద్-మన్నెగూడ రహదారిలో మర్రి చెట్ల తొలగింపునకు సంబంధించి ఎన్జీటీలో ఉన్న కేసు పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సీఎం సూచించారు. హైదరాబాద్-మంచిర్యాల-నాగ్‌పూర్ నూతన రహదారికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమర్పించిన



ప్రతిపాదనలనే అంగీకరించాలని సీఎం కోరారు. తాము ప్రతిపాదించిన మార్గంతో నూతన పారిశ్రామిక పార్క్‌ల ఏర్పాటుతో పాటు పలు జాతీయ రహదారుల అనుసంధానం పూర్తవుతుందని సీఎం తెలిపారు. మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163జి), ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్-63), జగిత్యాల-కరీంనగర్ (ఎన్‌హెచ్-563), మహబూబ్‌నగర్-మరికల్-దియోసుగూర్ (ఎన్‌హెచ్-167) రహదారులకు సంబంధించి భూ సేకరణ... పరిహారం పంపిణీలో జాప్యంపై ఆయా జిల్లాల కలెక్టర్లను వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పలుచోట్ల కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. అన్ని జిల్లాల్లో ఉన్న కేసులన్నింటిపై నివేదిక రూపొందించి వారంలోపు అడ్వకేట్ జనరల్‌తో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పరిహారం పంపిణీలో ఆలస్యంపై సీఎం ప్రశ్నించగా కాలా నుంచి నిధుల విడుదలలో జాప్యం ఉందని కలెక్టర్లు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పందిస్తూ జాబితాలు అప్‌లోడ్ అయిన వెంటనే నిధులు విడుదల చేస్తున్నామని, కలెక్టర్లు ఆ పనులు త్వరగా చేయాలన్నారు. ఈ విషయంలో ఏమాత్రం జాప్యాన్ని సహించమని సీఎం కలెక్టర్లను హెచ్చరించారు. భూ సేకరణలో ఆర్బిట్రేషన్ కేసులు పెండింగ్‌లో ఉంచడం సరికాదని.. వెంటనే వాటిని పూర్తి చేయడంతో పాటు కాలాకు జాబితాలను అప్‌లోడ్ చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. భూసేకరణ, పరిహారం పంపిణీని అక్టోబరు నెలాఖరుకు కచ్చితంగా పూర్తి చేయాల్సిందేనని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. భూ సేకరణ, పరిహారం నిర్ణయం, పంపిణీ విషయంలో అలసత్వం చూపే కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లపై వేటు వేస్తామని సీఎం హెచ్చరించారు.

జాతీయ రహదారుల నిర్మాణంలో అటవీ, పర్యావరణ శాఖ పెడుతున్న కొర్రీలపైనా సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. 2002 నుంచి 2022 వరకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అటవీ, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించారని... దాంతో ప్రస్తుతం అనుమతులు ఇవ్వడం లేదని ఫారెస్ట్ సౌత్ రీజియన్ ఐజీ త్రినాథ్ కుమార్ తెలిపారు. దానిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పని చేసిన అధికారులు ఇప్పుడు లేరన్నారు. ఉల్లంఘనలకు సంబంధించి వివరాలు సమర్పించాలని సీఎస్‌ను సీఎం ఆదేశించారు. అవసరమైనచోట ప్రత్యామ్నాయ భూమిని అటవీ పెంపకానికి ఇస్తామని సీఎం తెలిపారు. ఈ విషయంలో అవసరమైతే జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌లతో తాను స్వయంగా భేటీ అవుతానని సీఎం తెలిపారు. వన్యప్రాణులు లేని అటవీ ప్రాంతాల్లోనూ వన్య ప్రాణుల చట్టం అమలు చేస్తున్నారని సీఎం అన్నారు. నాన్ వైల్డ్ లైఫ్ ఏరియాల్లో వైల్డ్ లైఫ్ మిటిగేషన్ ప్లాన్‌కి ఎన్‌హెచ్ఏఐలో ఎటువంటి ప్రొవిజన్ లేకపోవడంతో అనుమతులు ఆలస్యమవుతున్నాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంలో అవసరమైన వ్యయం భరించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో చొరవ చూపి అటవీ అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణకు సీఎం సూచించారు.

తమ కార్యాలయ నిర్మాణానికి హైదరాబాద్‌లో రెండు ఎకరాల భూమి కేటాయించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వారికి అవసరమైన భూమిని చూసి ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. తమ విజ్ఞప్తికి సత్వరమే స్పందించినందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, కె.ఎస్.శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వినయ్ కుమార్ రజావత్, ఎన్‌హెచ్ఏఐ సభ్యుడు (ప్రాజెక్ట్స్) అనిల్ చౌదరి, మోర్త్ రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ శివశంకర్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర నాయకత్వంపై, శేరిలింగంపల్లి ప్రజలందరిపై ఉండాలి

**నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్**

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 22 (నమస్తే ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ బస్తీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆలయ ద్వారం పూజ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, నియోజకవర్గం నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి, పట్వారీ శశిధర్,జిల్లా గణేష్, ప్రభాకర్, సమ్మి రెడ్డి, సంగమేష్, రెహ్మాన్, శివ, వాసు, తిరుపతి, మోహన్ రెడ్డి, శ్రీనువాస్ గౌడ్, మహిళా కాంగ్రెస్ శ్రీదేవి, శిరీష సత్తూర్, మానెమ్మ, అరుణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఎన్‌ఓసీ

**మొదటి పేజీ తరువాయి...**

పూర్తిగా తెలంగాణ ప్రభుత్వమే తీసుకుంటుందని వివరిస్తూ ఒక హామీ పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. ఎన్‌ఓసీ అనేది కేంద్ర జల సంఘం ఆమోదం పొందడానికి అవసరమైన చివరి అంతర్రాష్ట్ర అనుమతి అని, అది లేనిదే ప్రాజెక్టు ముందుకు సాగదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ విస్తృతంగా లాభపడినా ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్ జిల్లాలోని భూపాలపట్నం తహసీల్‌లోకి విస్తరించి ముంపు కలిగిస్తుందని ఆయన అంగీకరించారు. సుమారు 13.06 హెక్టార్ల భూమి, 54.03 హెక్టార్ల నది ప్రాంతం, 6.35 హెక్టార్ల నాళా భూమి ప్రభావితమవుతాయని ఆయన వివరించారు. ఈ ప్రభావంపై ఛత్తీస్‌గఢ్ ఇదివరకే తన ఆందోళనలను వ్యక్తపరిచిందని ఆయన గుర్తు చేశారు. ఈ ఆందోళనలను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి, వాటిని పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. ముంపుతో ముడిపడిన అన్ని ఖర్చులను, ఛత్తీస్‌గఢ్ పరిధిలోని భూసేకరణ, పునరావాస బాధ్యతలను తెలంగాణ ప్రభుత్వమే భరించడానికి సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.



## ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదు

**నాలా పనులు పూర్తి చేయండి... లేదంటే మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం:కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 22 (నమస్తే ఉదయం)కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పూర్తి చేయకుండా జిహెచ్ఎంసి అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం తగదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్ తో కలిసి డివిజన్ పరిధిలోని సఫ్దర్ నగర్, రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాల్లో నాలాను పరిశీలించారు. నాలా పక్కనే ఉన్న ఇల్లు కూలిపోవడంతో దానిని కూడా పరిశీలించారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, నాలాల పక్కన ఉన్న ప్రజల సమస్యలను అధికారులు పట్టించుకోవాలని సూచించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినా అధికారులు పనులను మాత్రం మూడేళ్లయిన పూర్తి చేయకపోవడంపై మండిపడ్డారు. నాలాను కబ్జా చేస్తున్న అధికారులు చూస్తూ ఊరుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు వెంటనే ఖబ్జాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నిధులున్నా పనులు చేయకపోగా నాలా స్థలాలు ఖబ్జా అవుతుంటే కూడా పట్టించుకోకపోవడం ఏమిటని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. వెంటనే కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

**జోనల్ కమీషనర్ ను కలిసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

నాలా నిర్మాణ పనులను పూర్తి చేయకపోతే వచ్చే నెల 10 న మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. జోనల్ కమిషనర్ కలిసి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వివరించారు. గత ప్రభుత్వం హయాంలో పనులను, నిధులను మంజూరు చేసినా ఇంతవరకు పనులను పూర్తి చేయడం లేదని తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అల్లాపూర్ డివిజన్, బాలాజీనగర్ డివిజన్, బాలానగర్, ఫతే నగర్ డివిజన్ లలో నాలా రిటైనింగ్ వాల్ పనులను వెంటనే చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం విడాలని అన్నారు. పలువురు కాలనీ వాసులతో ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలపై జోనల్ కమిషనర్ తో చర్చించారు.



## హైదరాబాద్‌లో భారీ వర్షం

సహాయక చర్యలు చేపట్టారు.

పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక

ఉత్తర ఈశాన్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఉదయం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాగల 24 గంటల్లో ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశలో కదిలి వాయువ్య బంగాళాఖాతం ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉందని వెల్లడించింది. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో సోమవారం, మంగళవారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఈనెల 25న ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని.. దీని ప్రభావంతో 25, 26 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.



## బతుకమ్మ, దసరా పండుగలను ఘనంగా జరుపుకోవాలి

**పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు చంద్రారెడ్డి**

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 22 (నమస్తే ఉదయం) తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టుపడేలా బతుకమ్మ , దసరా పండుగలను ఘనంగా జరుపుకోవాలని పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి తెలిపారు. ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బస్తీలోని వివిధ కుడళ్ళలో ఏర్పాటు చేస్తున్న హైమాస్ట్ ఎల్ఈడి లైట్ల పనులను సోమవారం ఆయన దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ రోజు సాయంత్రం మహిళలు నిర్వహించే బతుకమ్మ సంబరాల్లో ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకు వస్తే తక్షణమే పరిష్కరిస్తానని చంద్రారెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, దాకూరు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం

**మొదటి పేజీ తరువాయి...**

ఈ జీఎస్టీ తగ్గింపు జరిగిందని తెలిపారు. జాతినుద్దేశించి ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్ను సంస్కరణలతో పాటు-, నేటి నుంచి అమల్లోకి వచ్చే జీఎస్టీ రేటు- సవరణలతో భారతీయులు ... 2.5 లక్షల కోట్లు- ఆదా అవుతుందన్నారు. ప్రధాని దీనిని 'బచత్ ఉత్సవ్' గా అభివర్ణించారు. తగ్గిన జీఎస్టీ రేట్లు- పేదలకు, మధ్యతరగతికి గొప్ప ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు. ఈ సంస్కరణలతో యువత, రైతులు, మహిళలు, దుకాణదారులు, వ్యాపారులు, వ్యవస్థాపకులు అందరూ గొప్ప ప్రయోజనం పొందుతారని అన్నారు. పండుగ సీజన్‌లో జీఎస్టీ తగ్గింపు అనేది ప్రజలకు మరింత ఆదా అవుతుందన్నారు. కొత్త జీఎస్టీ విధానం మధ్యతరహా, చిన్న వ్యాపారాలపై చూపే సానుకూల ప్రభావాన్ని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఇది పోటీ-తత్వాన్ని, ఆర్థిక వ్యవస్థను పెంచుతుందని అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో స్నాక్స్, కాఫీ, నెయ్యి, పనీర్, వెన్న, కెచప్, జామ్, డ్రై ఫ్రూట్స్, ఐస్ క్రీం వంటి రోజువారీ వినియోగ వస్తువులపై రేట్లు- తగ్గుతాయి. టీ-వీలు, ఎయిర్ కండిషనర్లు, వాషింగ్ మెషీన్లు వంటి వస్తువులపై కూడా ఏ÷ు తగ్గించారు. ఔషధాలపై 12శాతంనుంచి 5శాతానికి జీఎస్టీ తగ్గించారు. క్యాన్సర్, జన్యుపరమైన, అరుదైన వ్యాధులకు కీలకమైన ప్రాణాలను రక్షించే మందులను పూర్తిగా పన్ను నుంచి మినహాయించారు.

## సింగరేణి ఉద్యోగులకు దసరా బోనస్

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే ఉదయం)**

దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు భారీ శుభవార్త అందించింది. సంస్థకు వచ్చిన లాభాల్లో వాటాగా ప్రతి కార్మికుడికి రూ. 1,95,610 చొప్పున బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో సుమారు 71 వేల మంది కార్మికుల కుటుంబాల్లో పండగ శోభ ముందుగానే వచ్చినట్లయింది. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం వెల్లడించారు. సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో అద్భుతమైన పనితీరు కనబరిచిందని ఆయన తెలిపారు. సంస్థ మొత్తం రూ. 6,394 కోట్లు ఆర్జించగా, అన్ని ఖర్చులు పోను నికరంగా రూ. 2,360 కోట్ల లాభం వచ్చిందని వివరించారు. ఈ లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు బోనస్ రూపంలో పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ బోనస్ పంపిణీ కోసం ప్రభుత్వం మొత్తంగా రూ. 819 కోట్లను విడుదల చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రయోజనం సింగరేణిలోని శాశ్వత ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు కూడా వర్తిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... "సింగరేణి సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి ఆత్మలాంటిది. ఇది కేవలం బొగ్గు గని మాత్రమే కాదు, వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఒక ఉద్యోగ గని" అని అన్నారు. భవిష్యత్తులో సింగరేణిని కేవలం బొగ్గుకే పరిమితం చేయకుండా, కీలక ఖనిజాల మైనింగ్ రంగంలోకి కూడా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దసరా బోనస్‌తో పాటు దీపావళి సందర్భంగా కూడా కార్మికులకు మరో బోనస్ అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# జాతీయ రహదారుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీసీ సమావేశం పాల్గొన్న ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్

జనగామ, సెప్టెంబర్ 22(నమస్తే ఉదయం):జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయుటలో అవసరమైన భూ సేకరణ ప్రక్రియను జాప్యం లేకుండా సత్వరమే పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు తో కలిసి జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులకు అవసరమైన స్థల సేకరణ వంటి పలు అంశాలపై డా.బిఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. దసరా పండుగకు ముందే అన్ని పనులు పూర్తి కావాలని సీ.ఎం స్పష్టం చేశారు. కోర్టు కేసులకు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి పంపాలన్నారు.రహదారి నిర్మాణ పనులలో జాప్యం జరుగకుండా భూసేకరణలో ఎలాంటి ఆలస్యం జరుగకూడదన్నారు.జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఇంచార్జి కలెక్టర్ పింకేష్ కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షాలోమ్, జనగామ ఆర్డీఓ గోపి రామ్, ఆర్ అండ్ బి ఈఈ స్వరూప రాణి, మైనింగ్ అధికారి విజయ్ కుమార్, ఎఫ్ఆర్వో కొండల్ రెడ్డి, జాతీయ రహదారుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# గిరిజాదేవి అలంకారంలో అమ్మవారు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22(నమస్తే ఉదయం) గద్వాల పట్టణంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గద్వాల్ టౌన్ శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో మొదటి రోజు దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం గిరిజా దేవి అలంకారంలో భక్తులకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మ వారు దర్శనం ఇస్తోంది.


గణపతి హెూమంలో పాల్గొన్న భక్తులు

# వాసవి కన్యకా పరమేశ్వరి

### ఆలయాలలో ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు



కొత్తకోట, సెప్టెంబర్ 22(నమస్తే ఉదయం) కొత్తకోట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం , శ్రీ అంబా భవాని దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భీమ చంద్రకాంత్ ఆధ్వర్యంలో మొదటి రోజు వాసవీ మాతాను శ్రీ బాలా త్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారిని అలంకరించారు. ఆలయంలో మొదటి రోజు పూజలో పాల్గొన్న భక్తులచే గణపతి హెూమం అమ్మవారి కుంకుమార్చన అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ,రాత్రికి అల్పాహారం ఏర్పాటు చేశారు.కొత్తకోట పట్టణంలోని శ్రీ అంబా భవాని దేవాలయంలో అమ్మవారిని శ్రీ బాల త్రిపుర సుందరి మాతగా అలంకరించారు. తమిళనాడు చెన్నై పట్టణం నుండి వచ్చిన ప్రత్యేక అలంకరణ దారులు అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శింప చేశారు. ఈ నవరాత్రులలో ఈ అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయంలో ప్రత్యేక పూజలు పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ తరపున నిర్వాహకులు పొగాకు మహేష్ బాబు సోదరులు అన్నదానం , అల్పాహారం ఏర్పాటు చేశారు


వైద్య సీటు సాధించిన వంశీకృష్ణకు ఫీజు కోసం నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# ప్రభుత్వం ద్వారా భారీ సహాయం చేయిస్తా

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### వైద్య విద్యార్థి వంశీకృష్ణకు ఆర్థిక సహకారం, సన్మానం

### యువ నాయకుడు కేకే కృష్ణతో కలిసి పాతికవేల వితరణ

షాద్ నగర్, సెప్టెంబర్ 22(నమస్తే ఉదయం) నిరుపేద వైద్య విద్యార్థి వంశీకృష్ణకు ప్రభుత్వం ద్వారా పెద్ద సాయం చేసేందుకు కృషి చేస్తానని షాద్ నగర్ ఎమ్మెల్యే ,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. చెగిరెడ్డి ఘనాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద వైద్య విద్యార్థి వంశీకృష్ణకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో చదువుకునేందుకు ఆటంకాలు ఏర్పడ్డాయి ఈ విషయం హలో షాద్ నగర్ ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మరో యువ నాయకుడు కేకే కృష్ణ సోమవారం విద్యార్థికి పాతికవేల రూపాయలు నగదు అందజేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విద్యార్థి వంశీకృష్ణకు శాలువాతో సత్కరించారు. పేద విద్యార్థులు ఎంతో కష్టపడి గ్రామీణ స్థాయిలో బాగా చదువుకొని నేడు విద్యలు రాణిస్తున్నారని ఇది ఎంతో హర్షించదగ్గ పరిణామం అని అన్నారు. అతని చదువుకు ఇంకా ప్రభుత్వం ద్వారా ఏదైనా మంచి ఉపకారం జరిగేలా చూసే బాధ్యత తనదని ప్రకటించారు. తన అనుచరుడు కేకే కృష్ణ ద్వారా పాతికవేల రూపాయలు ఇస్తున్నందుకు ఆయనకు అభినందించారు ప్రతి సంవత్సరం పాతికవేల రూపాయలు ఆ విద్యార్థికి అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలబడుతుందని అదేవిధంగా కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు కూడా ఎల్లవేళలా అండగా ఉంటారని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా కేకే కృష్ణ మాట్లాడుతూ.. డబ్బుల కారణంగా పేదవాళ్ల చదువులు ఆగిపోకూడదని సమాజంలో మానవతా దృక్పథంతో నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు ఎల్లప్పుడూ అందరు ముందుకు వస్తారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని సభ్య సమాజానికి తెలియజేసిన హలో షాద్ నగర్ సంస్థకు కేకే కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ముందుంటుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో వైద్య విద్యార్థి వంశీకృష్ణకు తామంతా అండగా నిలబడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కె.టి దొడ్డి నాయకులు




గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22 (నమస్తే ఉదయం) కేటిదొడ్డి గ్రామానికి చెందిన నాయకులు సోమవారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జంగిలప్ప, పిల్లి శీను, రమేష్, నర్సింలు, ఆర్ రాజు, అంజి, బోయ వీరన్న ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.ఈ కార్యక్రమంలో గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, నాయకులు ఉరుకుంద, యుగంధర్ గౌడ్, అమరేష్, శేఖర్ రెడ్డి, వీరేష్,డి వీరేష్, ఆర్ వీరన్న, తాయప్ప, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరి సమస్య పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించాలి

### పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22(నమస్తే ఉదయం)సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా వాణి కార్యక్రమం ను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన 16 పిర్యాదులను స్వయంగా స్వీకరించి సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడటం జరిగింది. జిల్లా పోలీసు కార్యాలయంలో 16 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. సమస్యలను విన్నవించుకున్న వారిలో భూ సమస్యలు- 3, కుటుంబ తగాదాలకు సంబంధించి-4, గొడవలు పడటం కు సంబంధించి- 3, ప్లాట్ సంబంధించి - 1,గవర్నమెంట్ జాబ్ ఇప్పిస్తామని- 1, విదేశాలకు పంపుతామని - 1, ఇతర విషయాలపై - 3 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కి ప్రజలు నేరుగా అందజేశారు.ప్రజల నుండి స్వీకరించిన సమస్యలను సావదానంగా విన్న జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి బాధితుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రతి ఒక్క సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని, గ్రీవెన్స్ డే లో వచ్చిన ప్రతి ఫిర్యాదును ఆన్లైన్లో పొంద పరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించాలని అధికారులను ఆదేశాలు ఇచ్చారు.



# సస్పెండ్ చేసిన అదనపు కలెక్టర్ సీసీని విధుల్లోకి తీసుకోవాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22నమస్తే ఉదయం)జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న రాఘవేంద్ర గౌడ్ అన్యాయంగా సస్పెండ్ చేశారని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని టీజీఆర్ఎస్ఏ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం టీజిఆర్ఎస్ఏ ఆధ్వర్యంలో సస్పెండ్ గురైన అదనపు కలెక్టర్ సీసీ రాఘవేంద్ర గౌడ్ ను తిరిగి విధులోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 17న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవము సందర్భముగా జరిగిన ప్రోటోకాల్ విషయములో జరిగిన తప్పిదము నందు భాధ్యున్ని చేస్తూ సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న రాఘవేంద్ర గౌడ్ ను అన్యాయంగా సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. ఈ విషయములో సీసీ రాఘవేంద్ర గౌడ్ అన్యాయంగా సస్పెన్షన్ వెంటనే వెనక్కి తీసుకొని, ఎలాంటి క్రమ శిక్షణ చర్యలు లేకుండా విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రోటోకాల్ విషయములో మెమోలు జారిచేయబడిన ఇతర రెవిన్యూ అధికారుల పట్ల ఎలాంటి క్రమ శిక్షణ చర్యలు తీసుకోకూడదని జిల్లా ఉన్నతాధికారులను కోరారు. ఈ అన్యాయపు చర్యలను టిజీఅర్ఎస్ఏ సంఘం తరపున ముక్తకంఠముతో ఖండిస్తున్నట్లు వెల్లడించారు.అదేవిధముగా, ఇటువంటి అన్యాయపు చర్యలను మా యొక్క సంకల్పాన్ని క్షీణింపచేస్తున్నాయని, రెవిన్యూ సిబ్బందిపై ఇటువంటి చర్యలు జిల్లాలో జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని విన్నపించారు. ఈ కార్యక్రమంలో టీజీఅర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు కరుణాకర్, కార్యదర్శి అజిత్ కుమార్, టీఎన్ జీఓ అధ్యక్షుడు నాగార్జున గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంగా గుడి వంశీధర్ రెడ్డి

### గుమ్మడవెల్లి, చీటూర్ గ్రామలలో పలు కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సహాయం


కత్తుల శ్రీనివాస్ రెడ్డి ని పరామర్శిస్తున్న గుడి వంశీధర్ రెడ్డి



ఇటీవల మరణించిన కుటుంబం కు ఆర్థిక సహాయం అందిస్తున్న మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి

జనగామ, సెప్టెంబర్ 22(నమస్తే ఉదయం): జిల్లా లోని లింగాలఘనపూర్ మండలంలో ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మండల మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి ముందు వరసలో ఉన్నారు. సోమవారం గుమ్మడవెల్లి గ్రామం లో ఇటీవల అనారోగ్య సమస్యతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కత్తుల శ్రీనివాస్ రెడ్డి ని పరామర్శించారు.అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాసోజు విశ్వనాథం ఇటీవల అనారోగ్య సమస్యతో మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి 5000/- ఆర్థిక సాయం అందజేసి,వారికి మనోధైర్యాన్ని కల్పించారు. తరువాత మండలంలోని చీటూరు గ్రామంలో మాజీ సర్పంచ్ అయిల మల్లేష్ తల్లి చంద్రమ్మ ఇటీవల అనారోగ్య సమస్యతో మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు...ఈ కార్యక్రమం లో వారితో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, జనగామ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరి శివకుమార్ , గుమ్మడవెల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు దండిగ ఎల్లయ్య,జీడికల్ దేవస్థానం చైర్మన్ మూర్తి, చీటూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాకీర్తి మల్లయ్య,పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ నగర్ ప్రజలకు
# ఎల్లప్పుడు అండగా ఉంటా
## ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

బుద్వేల్, సెప్టెంబరు 22 (నమస్తే ఉదయం) : హనుమాన్ నగర్ బస్తీ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉండి వారి ఇండ్లకు ఎలాంటి డోకా లేకుండ చూస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. సోమవారం హనుమాన్ నగర్ కు చెందిన ప్రజలు మైలార్ దేవుపల్లి లో గల ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ నివాసానికి వచ్చి తమ స్థలాలను అధికారులు వచ్చి పరిశీలించి వెళు తున్నారని, తమకు భయం వేస్తుందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దానికి స్పందించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, హనుమాన్ నగర్ బస్తీ ప్రజలు నలభై సంవత్సరాలుగా ఇం డ్లు కట్టుకుని నివాసం ఉంటున్నారని, వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అనేక మార్లు తాను అసెంబ్లీలో మాట్లాడానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా హనుమాన్ నగర్ వాసుల సమస్యలను తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా ఉన్నారని గుర్తు చేశారు. హనుమాన్ నగర్ వాసులకు న్యాయం చేసేలా అధికారులు ఆలోచనలు చేయాలన్నారు. స్థానిక ప్రజలు ధైర్యంగా ఉండాలన్నారు. మీ ఇండ్లు పోతాయని ఎవరైనా చెప్పినా, వారి మాటలు నమ్మవద్దన్నారు. హనుమాన్ నగర్ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెలే ప్రకాశ్ గౌడ్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఉండేలా తాను ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. ఎలాంటి సౌకర్యాలు లేని సమయం నుంచి అక్కడ నివాసాలు ఏర్పరుచుకుని జీవిస్తున్న వారికి అక్కడే ఇళ్లపట్టాలు ఇచ్చి ఇండ్లు కట్టుకునేలా ప్రభుత్వం తో మాట్లాడుతానన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ను కలసిన వారిలో హనుమాన్ నగర్ కు చెందిన రోజా, నారాయణ స్వామి తదితరులు ఉన్నారు.


హనుమాన్ నగర్ బస్తీ ప్రజలతో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



# మహిళ హత్య కేసులో పురోగతి
### పోలీసులు అంతకులను గుర్తించారు
### సీసీ కెమెరాల ఆధారంగానే నిందితులను పట్టుకున్నట్టు తెలిసింది

రాజేంద్రనగర్,సెప్టెంబర్22(నమస్తే ఉదయం)రాజేంద్రనగర్ కిస్మత్ పూర్ బ్రిడ్జి క్రింద ఈనెల16న జరిగిన మహిళ హత్య కేసులో పోలీసులు పురోగతిని సాధించినట్లు తెలిసింది.కిడ్నాప్ చేసి అత్యాచారం చేసి అతి దారుణంగా హత్య చేసి 7రోజులు గడిచింది..పోలీసులకు సరైన ఆధారాలు దొరకకపోవడంతో హంతకులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు,ఎస్వోటీ సహా..ప్రత్యేక బృందాలు ఏర్పడి గాలించారు.ఎట్టికేలకు సవాల్ గా తీసుకున్న పోలీసులు నిందితులను పట్టుకున్నట్టు సమాచారం. హత్యకు గురైంది మల్లేపల్లి ప్రాంతానికి చెందిన మహిళగా పోలీసులు గుర్తించారు.రాజేంద్రనగర్ హైదర్ గూడలోని ఓ కల్లు కాంపౌండ్ లో కల్లుతాగి స్పృహ కోల్పోయిన మహిళను బలవంతంగా ఆటోలో కిడ్నాప్ చేసిన ఆటో డ్రైవర్లు ఆమెను కిస్మత్ పూర్ బ్రిడ్జి కిందికి తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు తెలుస్తుంది.ఆ తర్వాత హత్య చేసినట్లు తెలిసింది.అనంతరం మృతదేహాన్ని అక్కడే పడేసి పారిపోయిన హంతకులను పోలీసులు శ్రమించి సీసీ కెమెరాల ఆధారంగా రాజేంద్రనగర్ పోలీసులు,ఎస్ఓటీ బృందం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.పోలీసులు మహిళ హత్య కేసులో పురోగతి సాధించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. త్వరలోనే మీడియా సమావేశం ఏర్పాటు చేసి హత్య వివరాలను వెల్లడించుకున్నట్లు సమాచారం..

రాజేంద్రనగర్ హరి హర క్షేత్రం లో పార్వతీ దేవి అమ్మ వారి అలంకరణలో దర్శనం ఇచ్చిన అమ్మవారు



# భక్తి శ్రద్ధలతో ప్రారంభమైన
# శ్రీ దేవీ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

బుద్వేల్, సెప్టెంబరు 22 (నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ లో శ్రీ దేవీ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమైనాయి. ఉదయం నుంచే దేవాలయాలు భక్తులతో కిటకిటలాడుతు కనిపించాయి. నవ రాత్రులు పూజలందుకునే అమ్మవారు ఒక్కొక్క చోట ఒక్కొక్క అలంకరణలతో భక్తులకు దర్శనమిస్తున్నారు. దేవాలయాలు, వివిధ బస్తీలలో ఏర్పాటు చేసిన మండపాలలో అమ్మవారు పూజలందుకుంటున్నారు.


డైరీ ఫార్మ్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామీ వారి దేవాలయం లో బాల త్రిపుర సుందరీ దేవీ అలంకరణలో కొలువు దీరిన అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, నాయకులు ఈ వేణు గోపాల్, డి యాదగిరి, శ్రీకాంత్ లతో పాటు సూరి బాబు పంతులు

**రాజేంద్రనగర్ కిస్మత్ పూర్ బ్రిడ్జి క్రింద ఈ నెల 16న దారుణ హత్యకు గురై పడి ఉన్న మహిళ కేసులో ముగ్గురు నిందితులను రాజేంద్రనగర్ పోలీసులు, ఎస్ ఓ టీ బృందం వలపన్ని పట్టుకున్నట్లు సమాచారం. హత్యకు గురైంది మల్లేపల్లి ప్రాంతానికి చెందిన మహిళ గా పోలీసులు గుర్తించారు. రాజేంద్రనగర్ హైదర్ గూడ వద్ద కల్లు తాగి సృహ కోల్పోయిన మహిళను బలవంతంగా ఆటో లో కిడ్నాప్ చేసిన ఆటో డ్రైవర్ లు ఆమె పై కిస్మత్ పూర్ బ్రిడ్జి క్రింద అత్యాచారం చేసినట్లు తెలుస్తుంది. ఆ తర్వాత హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని అక్కడే పడేసి పారిపోయిన హంతకులు. ఐదు రోజులు శ్రమించి హంతకులను సీ సీ కెమెరాల ఆధారంగా పట్టుకున్న రాజేంద్రనగర్ పోలీసులు, ఎస్ఓటీ బృందం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది**

**- బుద్వేల్, సెప్టెంబరు 22 (నమస్తే ఉదయం)**

# ఫతేనగర్‌లో అంగరంగ వైభవంగా
# ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు
### మహిళలతోపాటు కోలాటమాడిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 22 (నమస్తే ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ సర్కిల్ ఫతేనగర్ డివిజన్ లో స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఎంగిలి పూల బతుకమ్మ కార్యక్రమానికి కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలతో కోలాటమాడి వారిని ఊతేజపరిచారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళలు బతుకమ్మ ఆడి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ తోము శ్రవణ్, నరేంద్ర చారి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కుతాడి రాములు, కంచి బిక్షపతి, సుదర్శన్ రెడ్డి, నసీర్ భారీ సంఖ్యలో కార్యకర్తలు, మహిళా సోదరమణులు పాల్గొన్నారు.


రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ముందు కూరగాయల విక్రయదారులు

# తమకు న్యాయం చేయండి:
### కూరగాయల దుకాణదారులు

బుద్వేల్, సెప్టెంబరు 22 (నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ జనచైతన్య పేజ్ -2 వద్ద పది సంవత్సరాలుగా కూరగాయలు అమ్ముకుంటున్నామని, కొన్ని రోజులుగా స్థానికులు ఇబ్బం దులకు గురి చేస్తున్నారని కూరగాయల విక్రయదారులు సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం కు చేరుకుని నిరసన కు దిగారు. తమ కుటుంబాల పోషణ కోసం జన చైతన్య ఫేజ్ - 2 వద్ద కూరగాయలు అమ్ముకుంటుంటే ఇక్కడ అమ్మవద్దని. తమకు డబ్బులు ఇవ్వాలని కొం దరు డిమాండ్ చేస్తున్నారని. రాజేంద్రనగర్ సర్కిల్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తమకు న్యాయం చేయాలని విజయ, పూర్ణిమ, జ్యోతి, మహ్మద్ ఖుష్బూ, మానింగ్, మహ్మద్ దావూద్లు అన్నారు.


టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్‌ను సన్మానిస్తున్న ముస్లిం మత పెద్దలు

# సానెం శ్రీనివాస్ గౌడ్‌కు పౌర సన్మానం

బుద్వేల్, సెప్టెంబరు 22 (నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ప్రశాంతంగా జరుగడానికి సహకరించిన టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్ ను సోమవారం ఆల్ ఇండియా సున్నీ ఉలామ బోర్డు ప్రతినిధులు సన్మానించారు. కుల్ హింద్ అజ్మతే ముస్తాఫా 32వ వార్షికోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్ ను డాక్టర్ ముల్ హాఫీజ్ మహ్మద్ మస్తాన్ అలీ బాద్రీ, మోయిజ్ బాబు చౌదరీ ల అధ్వర్యంలో ఈ సన్మానం జరిగింది.


మార్కండేయ నగర్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు కాలనీ భక్తులు



# రాజేంద్రనగర్‌లో దుర్గా మాతను దర్శించుకున్న భక్తులు

రాజేంద్రనగర్‌లో ప్రతిష్టించిన దుర్గామాత అమ్మవారిని సోమవారం భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎం నాగభూషణం, డి నర్సింహ రాజు, డి యాదయ్య, డి నర్సింహ, ఎం అర్జున్ తదితరులు పాల్గొన్నారు



# కంటోన్మెంట్‌లో వర్షపు నీరు, మురుగు నీటి సమస్యలకు పరిష్కారం!

కంటోన్మెంట్, సెప్టెంబర్ 22 (నమస్తే ఉదయం) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం , వర్షపు నీరు , మురుగునీటి సమస్యలకు సంబంధించిన కంటోన్మెంట్ సమస్యలపై ఎమ్మెల్యే గణేష్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధుకర్ నాయక్,డిఫెన్స్ ఎస్టేట్ ఆఫీసర్ దినేష్ కుమార్ రెడ్డి , వాటర్ సూపరింటెండెంట్ రాజ్ కుమార్ , హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్ , తెలుకుంట అరుణ్జోతి సతీష్ గుప్తా లతో వివరణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో వీలైనంత తొందరగా పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. నివాసితులకు ఉపశమనం కలిగించే దిశగా సానుకూల స్పందనకు, సమస్యలను ప్రాధాన్యతగా తీసుకున్నందుకు ఎమ్మెల్యే గణేష్ కి కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733